క్లుప్తంగా

ఆరోగ్యంతోనే జ్ఞాపకశక్తి



విద్యార్థినుల ఎత్తును కొలుస్తున్న దృశ్యం

కౌతాళం: ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థుల్లో మానసిక సామర్థ్యంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అన్నారు. కళాశాల విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆరోగ్య పరీక్షల్లో భాగంగా ఎత్తు, బరువు, రక్త పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండటానికి కావాల్సిన సలహాలిచ్చారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



అనితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోసిగి: మండల కేంద్రం మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అనిత రాష్ట్ర స్థాయి ఫుట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనపరిచిందని ప్రధానోపాధ్యాయుడు అంపయ్య తెలిపారు. జట్టులో కీలక పాత్ర వహించిన అనితను శనివారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ అండర్-14 రాష్ట్ర స్థాయి స్కూల్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ పోటీల్లో ఈనెల 21,22,23వ తేదీల్లో విశాఖపట్నం జిల్లా భీమవరంలో జరిగాయి. కర్నూలు జట్టు తరఫున పాల్గొన్న అనిత శ్రీకాకుళం, విశాఖపట్నం ,చిత్తూరు జిల్లాలపై ప్రతిభ చూపి జట్టు ద్వితీయ స్థానం నిలిచేలా కృషి చేసింది.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ఆంజనేయ స్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

కోసిగి: స్థానిక కడపాళెం వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీకమాసం రెండవ శనివారం ను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. వేకువజామున అర్చకులు దుర్గా ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణ, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు చేపట్టి మహా మంగళ హారుతులు ఇచ్చారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు.


రాష్ట్రంలో సంక్షేమ విప్లవం



కిట్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దకడబూరు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం నెలకొందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం శనివారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించారు. అలాగే.. కార్యక్రమానికి సంబంధించిన కిట్లను గృహసారథులు, వలంటీర్లుకు అందజేశారు. మాజీ ఎంపీపీ రఘురాముడు, నాయకులు రవిచంద్రరెడ్డి, గజేంద్రరెడ్డి, దేవదానం పాల్గొన్నారు.

రైల్వే గేటును ఢీకొన్న ఆటో



రైల్వే గేటు విరిగిన దృశ్యం

కోసిగి: స్థానిక రైల్వే క్రాసింగ్ వద్ద ఏర్పాటు చేసిన రైల్వే గేటును ప్యాసింజర్ ఆటో ఢీకొట్టడంతో గేటు విరిగిపోయింది. శనివారం సాయంత్రం రైలు వస్తుండటంతో సిబ్బంది గేటీ వేశారు. రైలు వెళ్లి పోయిన తర్వాత గేట్ మెన్ గేటు తెరిచే క్రమంలో ఒక వైపు తెరుచుకోగా, మరో వైపు తెరుచుకోలేక పోయింది. ఈ సమయంలో తెరుచుకున్న వైపు నుంచి ఆటో వేగంగా వచ్చి గేటును ఢీకొట్టడంతో గేటు మధ్యలోకి విరిగి పోయింది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోయి ట్రాఫిక్ స్తంభించింది. కాగా గేట్‌మెన తాత్కాలిక గేటు ఏర్పాటు చేశారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు
- పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాల వర్తింపు
- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

దేవనకొండ: పేదల ఆర్థికాభివృద్ధే వైస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. మండలంలోని పి.కోటకొండ సచివాలయం-2 పరిధిలో శనివారం మంత్రి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, మాల మల్లేశ్వర కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి ఆయా కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు లబ్ధి చేకూరిందా.. లేదా అని ఆయా కుటుంబాల సభ్యులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలు వర్తించాయని మంత్రితో సంతోషంగా చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి సీఎం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని గుర్తు చేశారు. పి.కోటకొండ గ్రామానికి సంబంధించి ప్రజలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.34.10 కోట్లు లబ్ధి పొందారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకవర్గాలు ఆలూరు నియోజకవర్గంలో ఇరువర్గాల మధ్య చిచ్చుపెట్టి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టులు, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరిగుతూ చాలా మంది దుర్భర జీవితాలు గడిపారని, తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శాంతిమార్గం చూపించానని గుర్తు చేశారు. ఏదైనా సమస్య తలెత్తినా అక్కడికక్కడే పరిష్కరించి ఇరువర్గాలను రాజీ చేయించి ప్రశాంతంగా జీవనం సాగించేందుకు తనవంతు తోడ్పాటు అందించానన్నారు. పిల్లాతల్లులు అందరూ కలిసి సంతోషంగా వ్యవసాయం చేసుకుంటూ రాత్రిపూట ప్రశాంతంగా గడిపే జీవితం ఇచ్చినటువంటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వాదించాలని మంత్రి ప్రజలను కోరారు. నాకు ఎంతో అనుభవం అంటూ చెప్పుకోవడం తప్పా చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఇక సినీ హీరో పవన్‌కళ్యాణ్ రెచ్చగొట్టే ప్రసంగాలు తప్పా అతనికి ఏమీ తెలయదని విమర్శించారు. మాయమాటలతో మభ్యపెట్టేందు వస్తున్న బాబు, పవన్ మాటలను నమ్మొద్దన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, జెడ్పీటీసీ రామకృష్ణ, సర్పంచ్ బండమీద తిమ్మక్క, నాయకులు మీనుగకృష్ణ, రామనాయుడు, రామచంద్ర, రంగస్వామి, హనుమంతరెడ్డి, లక్ష్మన్నస్వామి, నిజాల్ రెడ్డి, దివాకర్‌నాయుడు, లుముంబా, అరుణ్‌కుమార్, రాజారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అవ్వా... బాగున్నావా !

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పి.కోటకొండలో విస్తృతంగా పర్యటించిన మంత్రి గుమ్మనూరు జయరాం బీసీ కాలనీలో వృద్ధురాలు ఎల్లమ్మను పలుకరించారు. నిలువలేని ఆ వృద్ధురాలు నేలపై దోక్కుంటూ వెళ్తుండగా మంత్రి ఆప్యాయంగా పలుకరించారు. ఆమెతోపాటు నేలపై కూర్చుని కొద్దిసేపు ముచ్చటించారు. అవ్వా బాగున్నావా... పింఛన్ అందుతుందా... వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నారా అని మంత్రి ఆరా తీశారు. దీంతో వృద్ధురాలు చాలా బాగున్నా నాయనా... పింఛన్ నెలనెలా అందుతుంది. ఏమి తిప్పలు పడకుండా వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నాడు అని సమాధానం ఇచ్చారు. ఓటు ఎవరికి వేస్తావని మంత్రి అడగ్గా... ఇంకెవరికి జగన్‌బాబుకు వేస్తానంటూ వృద్ధురాలు గట్టిగా చెప్పారు.

క్రమశిక్షణతో అభ్యసించాలి

ఆదోని సెంట్రల్: విద్యార్థులు క్రమశిక్షణతో అభ్యసించాలని నారాయణ కళాశాల కోర్ డీన్ పి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలో శనివారం జేబీ గార్డెన్స్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం గత ఏడాది ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చివరగా విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏజీఎం నరేష్ అచారి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు నాణ్యతగా చేపట్టాలి

ఆదోనిరూరల్: మండలంలోని కొత్తూరు గ్రామ ఎంపీపీ స్కూల్‌లో నాడు-నేడు కింద చేస్తున్న పనులను నాణ్యతగా చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న కోరారు. శనివారం పనులను పరిశీలించి వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా స్కూల్ భవన నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని చెప్పారు. పార్టీ కార్యదర్శి జి.రంగనాథ్, సభ్యులు బొజ్జప్ప, కర్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే పెద్దపీట



మహిళలతో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్: ప్రజా సంక్షేమానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. శనివారం పట్టణంలోని 8వ వార్డులో వైస్ చైర్మన్ నరసింహులుతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బోయ శాంత, మనోజ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడారు. గడప గడప తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని అధికారులను కోరారు. అలాగే సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, కౌన్సిలర్లు తాయన్న, రఘునాథ్‌రెడ్డి, నాయకులు మల్లిక, సనాఖాన్,ఎక్బాల్, అశోక్, గోపాల్, ఏసేబు, యల్లప్ప, శ్రీనివాసరెడ్డి, చిరంజీవి, ప్రసాద్, బ్రహ్మయ్య, దినేష్, రీతూసింగ్, గోపాల్, లక్ష్మన్న, బ్రహ్మయ్య, వీరేష్, ఈశ్వర్, శ్రీనివాసులు, వెంకటేశులు పాల్గొన్నారు.

మహిళల హక్కులను రక్షించాలి



కోసిగిలో మానవహారం నిర్వహిస్తున్న మహిళలు, విద్యార్థినులు

కోసిగి: మహిళల హక్కులను రక్షించాలని పలువురు వక్తలు కోరారు. మండల కేంద్రంలో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ, ఐసీడీఎస్, వైద్య, ఏపీఎం శాఖల ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ హింసా నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఆర్డీటీ ఏరియా టీం ఆధ్వర్యంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఆర్డీటీ మహిళ ఎంపవర్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ హేమలత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరారెడ్డి, ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అలాగే స్త్రీశక్తి భవనం నుంచి ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి, కార్యాలయంలో పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. ఏపీఎం సత్యమ్మ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కలశ ప్రతిష్ఠ

ఆలూరు: స్థానిక కోటవీధిలో కొలువైన శ్రీ సుంకలమ్మవ్వ దేవాలయ కలశ ప్రతిష్ఠాపన శనివారం పండితులు బెల్డోణ రామనాథశాస్త్రి, రవిశాస్త్రి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. హోమం, గణపతిపూజ, పూర్ణహుతి, మహమంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్, ఎంపీపీ రంగమ్మ, వైస్ ఎంపీపీలు శ్రీరాములు, నాగవేణి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో దోష పరిహార పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆదోనిఅర్బన్: పట్టణశివారు మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం శనిదోష పరిహార పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో శనీశ్వరుడి విగ్రహానికి భక్తులు నువ్వులనూనెతో అభిషేకం చేశారు. అనంతరం దోష పరిహార పూజలు నిర్వహించారు. ముందుగా మంగరాయ ఆంజనేయస్వామికి ఫల పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరించి పూజలు చేశారు.


డిసెంబర్ 20వ తేదీ వరకు నీరివ్వండి



ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎల్లెల్సీ నీటివాటా సభ్యులు, రైతులు

ఆదోనిరూరల్: డిసెంబర్ 20వ తేదీ వరకు ఎల్లెల్సీకి నీటిని సరఫరా చేయాలని కోరుతూ శనివారం కర్నూలులోని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ రెడ్డిరాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు ఎల్లెల్సీ నీటివాటా సభ్యులు, రైతులు తెలిపారు. ఎల్లెల్సీ నీటివాటా సభ్యుడు సాయిబాబా మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం బోర్డు పరిధిలోని ఏపీలో 1.53 లక్షల ఎకరాల సాగుభూమి ఉందని, వీటికి తుంగభద్ర కాలువ నీరే ప్రధాన వనరని, తుంగభద్ర డ్యాం కింద మిరప, పత్తి పంటలు ఎక్కువగా పండిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం బోర్డు మీటింగ్‌లో కాలువలకు నవంబర్ 30వ తేదీ వరకు నీరు ఇవ్వాలని నిర్ణయించారన్నారు. నవంబర్ నెలలో డ్యాం పరివాహక ప్రాంతంలో వర్షాలు రావడం వల్ల అదనంగా 4 టీఎంసీల నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరిందన్నారు. దీనివల్ల రైతులకు ఇంకొన్ని రోజులు నీరు ఇవ్వాల్సి ఉందని, నిర్ణయించిన దాని ప్రకారం కాకుండా డిసెంబర్ 20వ తేదీ వరకు నీటిని విడుదల చేయాలన్నారు. దీనివల్ల రైతులకు చాలా మేలు జరుగుతుందని చెప్పారు. డిశంబర్ 20వ తేదీ వరకు 650 క్యూసెక్కుల నీరు రైతులకు అందించేలా సీఆర్‌పీఎఫ్ బలగాలను ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందని ఎస్ఈని కోరారు. రైతులు టిప్పుసుల్తాన్, నబిసాబ్, జట్టయ్య, తిక్కప్ప, ఖాసీం, ఉసేని, లింగన్న, దానప్ప, నాగరాజు, రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఖోఖో శిక్షణ



శిక్షణలో పాల్గొన్న క్రీడాకారిణులతో ఉపాధ్యాయులు

కౌతాళం: మండలంలోని బదినేహాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్-14 జిల్లా స్థాయి బాలికల ఖోఖో శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. చివరి రోజు జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్ పాల్గొని మాట్లాడారు. జిల్లా నుంచి 15మంది బాలికలు వారం పాటు ఖోఖోలో శిక్షణ పొందారని, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లాకు బంగారు పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈనెల 26-29 వరకు గుంటూరు జిల్లా నరసరావు పేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు హరనాథ్‌రావు, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కంబీరెడ్డి తెలిపారు. పోటీలకు బయలుదేరే విద్యార్థినులకు పెద్దతుంబళం నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణమూర్తి 15 జతల స్పోర్ట్స్ యూనిఫాం అందజేశారు. సర్పంచ్ నరసప్ప, ఎస్ఎంసీ చైర్మన్ మాలింగ, కోసిగి బాయ్స్ స్కూల్ హెచ్ఎం ఖలీల్‌అహ్మద్, మిల్టన్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, సాబిర్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో బిల్లుల మంజూరు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోనిటౌన్: మున్సిపాలిటీలో చేసిన పనులకు త్వరలో బిల్లులు మంజూరవుతాయని కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. శనివారం కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా పట్టణంలో చేసిన వివిధ అభివృద్ధి పనుల బిల్లులు సకాలంలో చెల్లించాలని పాలకవర్గ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, పార్వతి, నాగరత్నమ్మ, లక్ష్మీదేవి అధికారులను కోరారు. వెంటనే చెల్లిస్తే పనులు వేగంగా సాగుతాయని, బిల్లులు రాలేదన్న సాకుతో కాంట్రాక్టర్‌లు పనులు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై అధికారుల పనితీరుపై సభ్యులు నాగరత్నమ్మ, ఎన్.పి.లక్ష్మీదేవి, పార్వతీ నిలదీశారు. వార్డుల్లో అభివృద్ధి పనులు తామే స్వయంగా చేస్తామని అధికారుల దృష్టికి తీసుకోస్తే తమకు నిధులు కేటాయింపులో వివక్షతను చూపుతున్నారని మండిపడ్డారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు

ఆదోనిరూరల్: ఆదోని-సిరుగుప్పకు వెళ్లే ప్రధాన రోడ్డులోని మదిరె క్రాస్ రోడ్డు వద్ద శనివారం ఆదోని పోలీసులు కార్డెన్ సెర్చ్, వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి, ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు, పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య, తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి, దాదాపు 50 మంది పోలీసు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సిరుగుప్ప బోయగేరికి చెందిన వెంకటేష్, రఘు ఆటో, టూ వీలర్‌పై 16 బాక్సులు (90ఎం.ఎల్.పరిమాణం) తరలిస్తుండగా పట్టుకొని ఇస్వీ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మండలంలోని తోవి నుంచి బదినేహాల్‌కు వెళ్లే రహదారిలోని ఎల్లెల్సీ కాల్వ వద్ద బదినేహాల్‌కు చెందిన ఎం.నాగప్ప మోటార్ సైకిల్‌పై కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడని సెబ్ సీఐ హరికృష్ణ శనివారం తెలిపారు. మోటార్ సైకిల్‌పై 15 కర్ణాటక మద్యం బాక్సులను తరలిస్తున్నాడనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే పెద్దహరివాణం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేయగా సిరుగుప్పకు చెందిన విజయ్, అనిల్ మోటార్‌సైకిల్‌పై నాలుగు కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం బాక్సులను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. మదిరె గ్రామానికి చెందిన వీరేష్, ఉశేనప్ప మోటార్‌సైకిల్‌పై తరలిస్తున్న ఆరు కర్ణాటక మద్యం బాక్సులను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిపై కేసులు నమోదు చేశామని వివరించారు. దాడుల్లో ఆదోని సెబ్ ఎస్ఐ శివప్రసాద్, పెద్దహరివాణం చెక్‌పోస్టు సీఐ మంజుల, ఎస్ఐ కమలాకర్, సిబ్బంది సోమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

సకాలంలో పది పరీక్షల ఫీజు చెల్లించండి

ఆదోని సెంట్రల్: పదవ తరగతి పరీక్షల ఫీజును సకాలంలో చెల్లించాలని ఎంఈఓ బి. శివరాములు శనివారం తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఫీజులను చెల్లించడానికి డిసెంబర్ 4వ తేదీ వరకు గడువుందన్నారు. 5 నుంచి 9వ తేదీలోపు రూ.500 ఫైన్‌తో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రెగ్యులర్ అభ్యర్థులకు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 చెల్లించాలన్నారు. 3 సబ్జెక్టుల నుంచి ఎక్కువ ఉన్నా రూ. 125, 3 సబ్జెక్టులకైతే రూ.110 చెల్లించాలని చెప్పారు. ఒకేషనల్ కోర్సులకు అదనంగా రూ. 60, తక్కువ వయస్సు కలిగిన పిల్లలకు రూ.300 చెల్లించాలన్నారు. మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో రూ. 80 చెల్లించాలని సూచించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనించి సకాలంలో ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కోలుకోలేక మహిళ మృతి

ఆదోనిరూరల్: కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మమ్మ (50) శనివారం మృతిచెందిందని ఆదోని తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. ఈనెల 21న ఆదోని నుంచి ఆస్పరికి వెళ్తున్న ఆటోలో విరుపాపురం బస్టాండ్ వద్ద బర్రె అడ్డురావడంతో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో డ్రైవర్ పక్కనే కూర్చున్న ఆస్పరికి చెందిన లక్ష్మమ్మ ఆటో నుంచి జారి పడి తీవ్ర గాయాలపాలయ్యింది. చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

ఆదోనిరూరల్: డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ కర్నూలు రెడ్ రిబ్బన్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వివేకానంద జూనియర్ కాలేజీలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సహినాపర్వీన్, ఆర్డీప్ ప్రాజెక్టు మేనేజర్ మాలిక్ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాపి, నివారణ చర్యలను వివరించారు. ఓఆర్ డబ్ల్యూ ఎర్రిస్వామి, వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

1న బహిరంగ సామాజిక తనిఖీ

కౌతాళం: డిసెంబర్ 1న ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై బహిరంగ సామాజిక తనిఖీ సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ సుబ్బారాజు శనివారం తెలిపారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు చేసిన ఉపాధి పనులకు సంబంధించి తనిఖీ ఉంటుందన్నారు. మండలంలో ఇప్పటికే సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఈనెల 14నుంచి విచారణ ప్రారంభించారని ఈనెల 26కు పూర్తి చేస్తారని చెప్పారు. వారు సమర్పించిన నివేదిక ఆధారంగా వచ్చే నెల 1వ తేదీన బహిరంగ సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రేపు రణమండల కొండపై కార్తీక దీపోత్సవం

ఆదోనిఅర్బన్: కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా సోమవారం రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామి వారికి కార్తీకమాస పూజలు నిర్వహిస్తున్నట్లు కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి అధ్యక్షుడు మింటూ అగర్వాల్ శనివారం తెలిపారు. తెల్లవారుజామున 4 గంటలకు కొండకు ఇరువైపులా దీపోత్సవం ఉంటుందన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ఆదోని సెంట్రల్: భావితరాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ అని భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ సదాశివ తెలిపారు. శనివారం పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.